

11న 'సీతం'లో డాక్టర్ రెడ్డీస్ జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 11న డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ఉత్పాదక కేంద్రాలు వద్ద సెల్ మేనేజ్ టీమ్స్, అప్రెంటిస్ ట్రైనీ గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ శాఖల్లో పని చేసేందుకు విద్యార్హత ఇంటర్మీడియట్‌లో ఎంపిసి, బైపిసి, డిప్లమో, బిఎస్‌సి, ఎంఎస్‌సి (కెమిస్ట్రీ)లో 60శాతం మార్కులు సాధించి ఉండాలి. తెలుగు ఆంగ్ల భాషల్లో నైపుణ్యం ఉండాలి. సెల్ మేనేజ్ టీమ్స్ అప్రెంటిస్ ట్రైనింగ్‌లో రెండేళ్ల పాటు ఉచిత వసతి, భోజనం కల్పిస్తారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు కోరారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం


కార్మికుల సమ్మెతో మూతపడిన నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు

- కదం తొక్కిన కార్మికులు • లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్
- పలుచోట్ల భారీ ర్యాలీలు, మానవహారాలు
- మూతబడిన ప్రభుత్వరంగ సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు
- నిలిచిన ఆశా, ఎండిఎం కార్మికుల సేవలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, తదితర డిమాండ్లతో కార్మిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా విజయనగరం జిల్లాలో చేపట్టిన సమ్మె విజయవంతమైంది. కార్మికులు, ఉద్యోగులు, స్కీం వర్కర్లు, రైతులు ఎక్కడికక్కడే భారీ ర్యాలీలు నిర్వహించి, మానవహారాలు చేపట్టారు. దీంతో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులు, పోస్టాఫీసులు, అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెతో ఆయా సంస్థల్లో సేవలు నిలిచిపోయాయి. ఎల్ఐసి ఉద్యోగులు, మెడికల్ రిప్స్ , కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. కార్మికుల సమ్మెతో నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు, గరివిడిలోని డిఎఫ్ఎస్ తదితర మైన్స్ మూతపడ్డాయి. రాజాంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్.కోటలో జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, తెర్లాంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ చీపురుపల్లిలో సిఐటియు నాయకులు టివి రమణ, బొబ్బిలిలో జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, గజపతినగరంలో వి.లక్ష్మి నిరసన ర్యాలీల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో కార్మిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక పిలుపులో భాగంగా కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంటస్తంభం మీదుగా కన్యకాపరమేశ్వరి జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 8 గంటలు పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినదించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎం.కౌశిక్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం పూర్తిగా కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను, హక్కులను, 8 గంటలు పని దినాన్ని కార్మిక కోడ్‌ల పేరుతో 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులు లేకుండా చేస్తుందన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్,స్కీమ్ వర్కర్ల ఆశా,అంగన్వాడీ కార్యకర్తలకు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు,మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మరోవైపు విద్యుత్ ఛార్జీల భారాలు వేసి ప్రజలు నడ్డి విరుస్తున్నారన్నారు. ఇది చాలదన్నట్లు స్మార్ట్ మీటర్లు బిగించి మరింత విద్యుత్ భారాలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూకుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదన్నారు. ఈనేపథ్యంలో కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవడంతో పాటు దేశాన్ని, ప్రభుత్వ రంగాన్ని దోపిడీదారుల నుంచి కాపాడుకోవాల్సిన కర్తవ్యం అందరిపైనా ఉందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తున్న కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు


విజయనగరం కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్‌లో మానవహారం చేస్తున్న పలు రంగాల కార్మికులు, స్కీంవర్కర్లు,


విజయనగరంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సుబ్బరావమ్మ

ఎ.జగన్మోహనరావు, బి.రమణ, ఐఎఫ్‌టియు నాయకులు అప్పలసూరి, ఐఎన్‌టియుసి నాయకులు అప్పికొండ మధుసూదనరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యు ఎస్ రవికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భగవాన్, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన పలువురు జర్నలిస్టులు, రవాణా రంగ కార్మికులు, మెడికల్ రిప్స్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఎండిఎం, మున్సిపల్ కార్మికులు, విఆర్ఎలు, ఎల్ఐసి ఉద్యోగులు, ఇలా 19రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు. సమ్మెకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాము సిహెచ్ వెంకటేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, మద్దతు మద్దతు తెలిపారు.

విజయనగరం ఎల్ఐసి ఆఫీస్ ఎదుట ఎల్ఐసి ఉద్యోగులు నిరసన తెలిపారు. ఐసిఇయు విజయనగరం బేస్ యూనిట్ సెక్రెటరీ ఆర్.అప్పల నాయుడు మాట్లాడారు. స్.తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసి పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఎం..శ్రీనివాస మాట్లాడారు. ఉద్యోగులు, క్లాస్3,4 ఉద్యోగులు పెన్షనర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు భవన్ వద్ద ఎపి విద్యుత్ జెఎసి ఆధ్వర్యాన ఉద్యోగులంతా నిరసన తెలిపారు. జెఎసి చైర్మన్ సురగాల లక్ష్మణరావు , విద్యుత్ ఉద్యోగు నాయకులు ఎల్. సత్యనారాయణ, పి.అప్పలస్వామి నాయుడు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోగ్యారేజ్ వద్ద ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కేంద్ర కార్మిక సంఘాల చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ జోనల్ కార్యదర్శిఅ వి. రాములు, డిపో సెక్రెటరీ చంద్రయ్య, అధ్యక్షులు సిహెచ్ వి రావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ, ఆర్‌టిసికే కేటాయించాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కాల్ ఆన్ డ్రైవర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇయు డిపో సెక్రెటరీ చవక శ్రీను, కెవి రమణ మాట్లాడారు.

ఎఐఎఫ్‌టియు న్యూ ఆధ్వర్యంలో ప్రదర్శన

ఎఐఎఫ్‌టియు. న్యూ ఆధ్వర్యంలో పార్క్ నుండి గంటస్థంభం మీదుగా కన్యకాపరమేశ్వరి కోవెల, ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వరకు భారీ ప్రదర్శన జరిగింది. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్దతిని రద్దు చేయాలని, 8 గంటల పని దినాన్ని కొనసాగించాలని. 'ఇ' చలానాల నుండి ఆటో డ్రైవర్లను మినహాయించాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణ రావు, ఎన్. అప్పలరాజు రెడ్డి మాట్లాడారు.

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా సమ్మె

విజయనగరం కోట : ఎఐటియుసి ఆధ్వర్యాన గంటస్తంభం నుంమచి స్టేట్‌బ్యాంకు వద్ద గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీ కోసమే పాలన సాగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యం కావాలని అన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ , సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు మాట్లాడారు.

నిలిచిన రూ.100 కోట్ల లావాదేవీలు

విజయనగరంకోట : స్టేట్ బ్యాంక్ మినహా మిగతా అన్ని బ్యాంకులు సమ్మెలో పాల్గొన్నాయి. ఆలిండియా బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన సుమారు 300 మంది ఈ సమ్మెలో పాల్గొని కార్మిక సంఘాలకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను బడా కార్పొరేట్ బాబుల చేతుల్లో పెట్టడం దుర్మార్గమైన చర్యని అన్నారు. సమ్మెతో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.100 కోట్ల లావాదేవీలు నిలిచిపోయాయి. ఎఐబిఇఎ జిల్లా అధ్యక్షుడు బి.వి ప్రసాద్, రవికుమార్, శ్రావణ్ తదితరుల ఆధ్వర్యాన బ్యాంకు ఉద్యోగులంతా విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. యూనియన్ జాయింట్ సెక్రెటరీ శ్రావణ్‌కుమార్, సెక్రటరీ మనోజ్, డిసిసిబి జనరల్ సెక్రెటరీ ఆంధ్ర బ్యాంక్ కష్ణ కమిటీ సభ్యులు నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ బ్యాంకుల నుంచి సుమారు 150 మంది సమ్మెలో పాల్గొన్నారు. ఎస్‌పి బంగ్లా వద్దగల గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎపిజిబి ఆఫీసర్స్ అసోసి జనరల్ సెక్రటరీ గంట అప్పలనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫణికుమార్ సుదర్శన, సాయి సుధాకర్, జిల్లా ఉభయ సంఘాల రీజినల్ సెక్రటరీలు అంబటి దుర్గ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మెతో మూతపడిన కెనరా బ్యాంకు



శృంగవరపుకోట : ర్యాలీ నిర్వహిస్తున్న పలు రంగాల కార్మికులు, స్కీం వర్కర్లు



రాజాం : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు, స్కీం వర్కర్లు



చీపురుపల్లి : ర్యాలీ చేస్తున్న సిఐటియు నాయకులు, స్కీం వర్కర్లు



విజయనగరంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, ఎఐటియుసి నాయకులు

చేపలవేటకు వెళ్లి ప్రాజెక్టులో చిక్కుకున్న తండ్రీకొడుకులు

ముమ్మరంగా గాలింపు చర్యలు

ప్రజాశక్తి-వంగర

మడ్డువలస ప్రాజెక్టులో మగ్గూరు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు దాసరి రాములు, (70) దాసరి ఆదినారాయణ (37) పడవలతో ప్రాజెక్టులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లి చిక్కుకున్నారు. గాలి ఎక్కువగా వీయడంతో గుర్రపు డెక్కలో చిక్కుకున్నారు. ఈ విషయం సాయంత్రానికి తెలియడంతో ప్రాజెక్ట్ వద్దకు పోలీసులు చేరుకొని స్థానిక మత్స్యకారులను ప్రాజెక్టులో పంపించి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టులో చిక్కుకున్న ఇద్దరు మత్స్యకారులు ఆచూకీ లభించినట్లు మత్స్యకారులు తెలిపారు అయితే చిక్కుకున్న మత్స్యకారులు బయటకు వచ్చేందుకు ఇబ్బందిగా ఉందని తెలిపారు దీంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారతీయ వాయు సేన లో ఎయిర్ మెన్ శాశ్వత పద్ధతిన, అగ్నిపథ్ పథకంలో 4ఏళ్ల కాల పరిమితికి అగ్నివీర్ (వాయు)గా చేరేందుకు అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోరారు. ఎంపిక పరీక్ష కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 2025 జూలై 11న 11 గంటలకు ప్రారంభమై, జూలై 31న రాత్రి 11 గంటలకు ముగుస్తుందని తెలిపారు. ఈ వెబ్ పోర్టల్‌లద్వారా https://airmenselection.cdac.in,https://agnipath-vayu.cdac.in తాత్కాలిక అడ్మిట్ కార్డులు జారీ చేసిన నమోదిత అభ్యర్థులు మాత్రమే ఎంపిక పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ స్పష్టం చేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో సంపూర్ణ పారిశుధ్య విధానం అమలులో నిర్లక్ష్యాన్ని సహించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలో ఓ దుకాణ సముదాయం వద్ద రహదారిపై విచ్చలవిడిగా అధిక మొత్తంలో చెత్తాచెదారాలు పడవేయడానికి గమనించారు. తక్షణం పారిశుధ్య పర్యవేక్షకుడిని పిలిచి చెత్తను రహదారిపై వేసిన సదరు దుకాణ యజమానికి అపరాధ రుసుము విధించాలని ఆదేశించారు. బుధవారం ఉదయం కొంతమంది వీధివిక్రయదారులు గంటస్తంభం ప్రాంతంలో వ్యర్థాలను రహదారులపై వేయడాన్ని గమనించిన పారిశుధ్య సిబ్బంది వారికి అపరాధ రుసుము విధించారు.

నేడు ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులుగా ఎన్నికైన విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శిగా, జెఎసి డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నికైన డివి రమణ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10.30గంటలకు వై జంక్షన్‌కు చేరుకోనున్న వీరికి ఉద్యోగులంతా స్వాగతం పలికి అక్కడి నుంచి బైక్ ర్యాలీతో జిల్లా పరిషత్ సమావేశ మందిరానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 12గంటలకు జిల్లా, తాలూకా యూనిట్ కార్యవర్గం, జెఎసి మిత్రసంఘాల కార్యవర్గంతో సమావేశం అవుతారు. అనంతరం వారిని ఉద్యోగులంతా కలసి సన్మానించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు టి.శ్రీధర్ బాబు, కార్యదర్శి సురేష్, సహా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ తెలిపారు.

నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

- బడి పండగకు ముస్తాబైన పాఠశాలలు •2232 పాఠశాలలు, 180 జూనియర్ కళాశాలల్లో కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బడి పండగకు పాఠశాలన్నీ ముస్తాబయ్యాయి. జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ పెద్ద ఎత్తున నిర్వహించదానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పిల్లల చదువు, ఆరోగ్యం, బాగోగుల కోసం తల్లి దండ్రులు ఉపాధ్యాయులతో కలసి చర్చించడానికి సిద్ధమయ్యారు. గత ఏడాది కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే జరిగిన ఈ కార్యక్రమాలు ఈఏడాది ప్రైవేటు పాఠశాలల్లో కూడా నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2232 పాఠశాల నుండి 2,10,377 మంది విద్యార్థులు, 180 జూనియర్ కళాశాలల నుండి 38,478 మంది విద్యార్థులు వారి తల్లి దండ్రులతో కలసి హాజరు కానున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా ఈ పిటిఎం సమావేశాలు నిర్వహించనున్నారు.

పిల్లలే ఆహ్వానాలను తల్లి దండ్రులకు అందించడం , ఆహ్వానంతో పాటు ఒక ఫార్మాట్ ను కూడా ఇవ్వడం , తల్లి తండ్రులు ఆ ఫార్మాట్ పై వారి అభిప్రాయాన్ని రాసి తిరిగి సమర్పించేలా రూపొందించారు. దీని ద్వారా విద్య, వసతులపై తల్లిదండ్రుల అభిప్రాయాల్ని తెలుసుకునే అవకాశం కలుగుతుంది. పండగలా నిర్వహించే ఈ కార్యక్రమాలలో పాఠశాల అభివృద్ధికి కావలసిన మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల చదువు, భవిష్యత్తు, ఆరోగ్యం తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల చర్చ జరుగుతుంది. విద్యార్థి గత ఏడాది సాధించిన ప్రతిభను, ఈ ఏడాది సాధించవలసిన దాని గురించి చర్చ జరుగుతుంది. విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరిపి వారి ఆరోగ్య స్థితి పై 10న వారికి అందించే హోలిస్టిక్ కార్డ్లలో రిమార్క్స్ కాలంలో రిపోర్ట్ చేసి తల్లిదండ్రులకు అందజేస్తారు. ఈ కార్డుల ద్వారా వారి ప్రోగ్రెస్ తో పాటు పిల్లల ఆరోగ్య పరిస్థితిని కూడా తల్లిదండ్రులు తెలుసుకోగలుగుతారు. పిల్లలకు అందజేసిన యూనిఫారం, బూట్లను తప్పకుండా ధరించి ఈ మెగా మీట్ కు రావాలని ఇప్పటికే విద్యా శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు.



బొండపల్లి జెడ్‌పి హైస్కూలు ఆవరణలో పిటిఎం ఆకృతిలో విద్యార్థులు

ఉదయం 9 గంటల నుండి తరగతి గదుల్లో ఉపాధ్యాయులతో ఇంటరాక్షన్ అనంతరం తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమాలకు ఆహ్వానించారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీసి పలు పోటీలను నిర్వహించడం, తల్లి దండ్రులకు రంగోలీ, టగ్ అఫ్ వార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులను కూడా అందజేయడం జరుగుతుంది. తల్లి పేరుతో ఒక మొక్క నాటడం ఈ ఏడాది థీమ్ గా ప్రభుత్వం తీసుకుంది.

రికార్డు స్థాయి లో నిర్వహిస్తున్నాం

ఈ ఏడాది మెగా టీచర్స్ పేరెంట్స్ మీట్ ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఒకే రోజు అన్ని పాఠశాలల్లో రికార్డు స్థాయి లో నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో కూడా నిర్వహిస్తున్నాం. గత ఏడాది కేవలం తల్లి లేదా తండ్రి ఒక్కరే పాల్గొన్నారు. ఈ ఏడాది ఇద్దరినీ తప్పనిసరిగా పాల్గోనేలా ఆహ్వానాలు పంపాం. కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులంతా హాజరై జయప్రదం చేయాలి.

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు : జెసి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జ్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం జెసి ఛాంబర్‌లో బుధవారం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన చర్యలు, నిధుల కేటాయింపుపై చర్చించారు. జెసి సేతుమాధవన్ మాట్లాడుతూ ఆన్‌డిమాండ్ పుస్తకాల కోసం రూ.3లక్షలు, బిల్డింగ్ నిర్మాణానికి రూ.50లక్షలు, ఇతర పుస్తకాల కొనుగోలుకు రూ.లక్ష కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కమిటీ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో వయోజనవిద్యాశాఖ ఇన్‌ఛార్జి డిడి ఎస్.సుబ్రమణ్యం, ఇన్‌ఛార్జి డిపిఆర్ఒ ఎం.మల్లేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, డివిజనల్ పంచాయతీ అధికారాణి శిరీష, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యార్థులను అభినందించిన జెసి

విజయనగరంటౌన్ : కేంద్రీయ విద్యాలయంలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ మీటింగ్ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. గత ఏడాది పరీక్షలు, క్రీడలలో విద్యాలయం సాధించిన అత్యుత్తమ ఫలితాలను ఆయన ప్రశంసించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు, క్రీడలతో పాటు కెరీర్ గైడెన్స్ పై ప్రత్యేకమైన తరగతులు నిర్వహించాలని, మరింత మెరుగైన మార్కులు / గ్రేడ్స్ సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా పాటుపడాలని వారిలో ఉత్తేజం నింపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ మోడీ, మెప్మా పీడీ జివి చిట్టిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెటర్నరీ కాలేజీని కేంద్రప్రభుత్వం గుర్తించడం పట్ల మంత్రి హర్షం

విజయనగరంకోట : గరివిడిలో ఉన్న వెటర్నరీ సైన్స్ కాలేజీకి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం పట్ల రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు తమ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, కార్యదర్శిని అభ్యర్థించడంతో కేంద్ర ప్రభుత్వం ఆ కళాశాలకు అనుమతిని మంజూరు చేసిందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజల దీర్ఘకాలిక అవసరాలను తీర్చేందుకు స్థాపించిన ఈ కళాశాలలో గతంలో మొదటి రెండవ సంవత్సరాల విద్యార్థులకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కల్పించిందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో మాసాంతర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు కేసులపై సమీక్షించారు. ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలకు శక్తి యాప్ గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు శక్తి టీమ్స్ మరింత విస్తతంగా పని చేయాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్సు టెక్నిక్స్ నేర్పించేందుకు శక్తి వారియర్స్ టీమ్స్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలపై పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదులపై వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని, ప్రతీవారం వారిని స్టేషనుకు పిలిపించి కౌన్సిలింగు నిర్వహించాలన్నారు. పలు కేసుల్లో పురోగతి సాధించిన పోలీసు అధికారులను ఎస్‌పి అభినందించారు. ఎఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బస్సుల్లేక ఇక్కట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సింహాచలంలో జరిగే సింహాద్రి అప్పన్న గిరి ప్రదర్శనకు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు వేల సంఖ్యలో బుధవారం ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకోవడంతో సకాలంలో బస్సు లేక అవస్థలు పడ్డారు. గంటకోసారి వచ్చిన బస్సులు ఎక్కేందుకు తోపులాటలు చోటు చేసుకున్నాయి. బస్సులు ఎక్కువ సేపు రాకపోయేసరికి రోడ్లమీద ఎండలో బస్సుల కోసం ఎదురు చూడాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ప్రయాణిల రద్దీకి తగ్గట్టు బస్సులను ఏర్పాటు చేయడంలో ఆర్‌టిసి అధికారులు విఫలమయ్యారు. కెల్ల గ్రామానికి చెందిన సామంతుల హైమావతి బస్సు ఎక్కుతుండగా కండక్టర్ నెట్టడంతో ఆమె కింద పడిపోయింది.ఇంతలో బస్సు కదలడంతో కుడికాలిపై నుంచి బస్సు వెళ్లేపోయేసరికి తోటి ప్రయాణికులు ఆమెను బయటకు లాగారు. దీంతో ఆమె స్వల్ప గాయంతో బయటపడింది. కుడికాలు చిటికెను వేలి నలిగిపోయింది. అయినా అధికారులు పట్టించుకోపోవడంతో బంధువులు ఆటోలో ఆస్పత్రికి తరలించారు.


బస్సు ఎక్కేందుకు తోపులాడుకుంటున్న యాత్రికులు

కదం తొక్కిన కార్మిక లోకం

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్కీమ్‌వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు పరం చేయొద్దని నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీలు, మానవహారం, రాస్తారోకోలు చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, క్వారీ కార్మికులు, ఆటో కార్మికులు, కళాసీలు, గ్రీన్ అంబాసిడర్లు, ఎల్ఐసి ఏజెంట్లు తదితరులు పాల్గొని సమ్మెను విజయవంతం చేశారు.

ప్రజాశక్తి - రాజాం

కార్మిక, ప్రజా సంఘాలు ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమ్మె సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బొబ్బిలి రోడ్డు జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ఎత్తున ప్రదర్శన ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. అనంతరం ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ రావు, ఎల్ఐసి నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సిహెచ్.రూపావతి, ఆశావర్క్ నాయకులు గౌరమ్మ, వి.ఆర్ఎ నాయకులు అప్పలస్వామి, షుగర్ ఫ్యాక్టరీ యునియాన్ అధ్యక్షులు శ్రీధర్, భవన నిర్మాణ సంఘం నాయకులు కే.ఆశిరప్పుడు, ఎం.త్రినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్స్ నాయకులు నాయుడు, రైస్ మిల్ యూనియన్ నాయకులు శ్రీనివాసరవు, గ్రీన్ అంబాసిడర్స్ పెంటయ్య, శివ, యుటిఎఫ్ చంద్రశేఖర్, సుశీల, కుమారి, కంచి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం పట్టణంలో అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, క్వారీ కార్మికులు, ఆటో కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు, సహారా బాధితులు, ఏజెంట్లు కలిసి నిర్వహించిన సమ్మెలో సిఐటియు జిల్లా అధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు. ముందుగా పట్టణంలోని దేవి కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవి కూడలిలో మానవహారం చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు అమలకు ప్రయత్నం చేస్తుందని ఇది చాలా దుర్మార్గమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుల చెలికాని ముత్యాలు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు శ్యామల, భాస్కరరావు, మద్ది మాణిక్యం ఫీల్డ్ అసిస్టెంట్లు, విఆర్ఎలు, కార్మికులు, కర్షకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కార్మిక లోకం యావత్తు చీపురుపల్లి పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించింది. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి లావేరు రోడ్డు ఆంజనే యపురం రోడ్డు మెయిన్ రోడ్డు మీదగా గాంధీభవ జంక్షన్ వరకు వేలాది మంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో చీపురుపల్లి పట్టణం ఒక్కసారిగా హోరెత్తింది. అనంతరం మూడు రోడ్లు కూడలిలో మానవహారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడుతూ దేశంలోని పెట్టుబడిదారుల, యజమానుల ప్రయోజనాల కోసం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంబల్ల గౌరి నాయుడు, జై విశ్వనాథరాజు, అంగన్వాడి, ఆశావర్కర్లు, బిల్డింగ్ కార్మికులు, మైనింగ్ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

గజపతినగరం రూరల్ : గజపతినగరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు, స్కీమ్ వర్కర్లు భారీ ప్రదర్శన నిర్వహించారు.



తెర్లాం: నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి సూర్య మహల్ థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పని పెంపుదల నిర్ణయం వెనక్కి తీసుకోవాలని, కార్మికులందరికీ కనీస వేతనం 26 వేల రూపాయల అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి. శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ లీడర్స్ పి. జ్యోతి, ఎం సుభాషిని, కుమారి, హైమ, ఆశా లీడర్స్ రాజేశ్వరి, అప్పలకొండ, సింహాచలం, లీల, భారతి, పంచాయతీ కార్మిక నాయకులు బి.కనకరాజు, ఆటో యూనియన్ నాయకులు బి అప్పలనాయుడు, ఎల్ దాలినాయుడు. విఆర్ఎ నాయకులు సింహాచలం, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ నాయకులు కె.రాము, కె.నూకరాజు, జి.మూర్తి, ఎస్.కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘ నాయకులు సరస్వతి, లక్ష్మి, స్కూల్ ఆయా నాయకులు పి. పైడ్రాజు, లీల, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి పైడపు నాయుడు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి గాంధీ బొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజన, విఆర్ఎ, విఒఎ, ఆటో కార్మికులు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, హమాలి సంఘం నేతలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా నాయకుడు బలస శ్రీను, అరుణ, సత్యవతి, రాధా, జ్యోతి కుమారి, రైతు సంఘం నాయకులు ఈశరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఎర్రంనాయుడు పాల్గొన్నారు.


బొబ్బిలి: ఎన్‌టిఆర్ కూడలిలో మానవహారం చేస్తున్న కార్మికులు, స్కీం వర్కర్లు

కొత్తవలస: సిఐటియు, ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో జరిగిన సమ్మె కార్మికుల నినాదాలతో కొత్తవలస జంక్షన్ మారు మోగింది. కొత్తవలస జంక్షన్ నలుమూలల నుంచి రెండు సంఘాలు వేరువేరుగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సుధారాణి డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆశాలు, మున్సిపల్ వర్కర్స్, విద్యుత్ హమాలీలు, జ్యూట్ కార్మికులు స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి నగర పంచాయతీ కార్యాలయం, స్టేట్ బ్యాంకు మీదుగా మొయిద కూడలి వరకూ ర్యాలీ చేపట్టి అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, అంగన్వాడీలు పి.మంగలక్ష్మి, ఆర్. జయ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.బాబురావు, హరిబాబు,


గజపతినగరం: మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్

విద్యుత్ హమాళీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, మీసాల లెనిన్, కలిశెట్టి శ్రీను, ఆశా వర్కర్స్ నాయకులు చందక అప్పలనారాయణ, జ్యూట్ కార్మికులు జె. సత్యారావు, కె. కరువులు తదితరులు పాల్గొన్నారు.

మండల సమన్వయ కమిటి ఏర్పాటు

సిఐటియు సమన్వయ కమిటి గౌరవ అధ్యక్షులుగా కిల్లంపల్లి రామారావు, కన్వీనర్‌గా బండి హరిబాబు, కమిటీ సభ్యులు పి మంగలక్ష్మి, ఆర్ జయలక్ష్మిసి హెచ్ అప్పలనారాయణ, పద్మ, బాబురావు, దుర్గారావు, పతివాడ లక్ష్మణరావు, ఎన్నికయ్యారు.

బెవరేజెస్ ఆధ్వర్యంలో.. స్థానిక ఎపి బేవరేజెస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో బెవరేజెస్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బెవరేజెస్ కార్మిక సంఘం నాయకులు బూర సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక వేణుగోపాల స్వామి కోవెల సెంటర్ నుండి చర్చి సెంటర్ బజార్ మీదుగా ఎన్‌టిఆర్ బొమ్మ వరకు కార్మికులు పెద్ద ఎత్తున ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, పికెఎస్, రైతుసంఘం, అంగ న్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, విఆర్ఎ, విఒఎ, మునిసిపల్, అసంఘటి తరంగా కార్మికులు పాల్గొన్నారు. ఈ సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కే విజయ్ గౌరి మద్దతు పలికారు. సిఐటియు నాయకులు పి.శంకర్రావు ఏఐటియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు, టి.అప్పలనాయుడు, ఐఎఫ్‌టియు పిల్ల లక్ష్మణా, అంగన్వాడి యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల శాంతమ్మ, రామలక్ష్మి, సిఐటియు మండలం నాయకులు జి.లక్ష్మి, రైతు సంఘం నాయకులు ఉడమల ప్రసాదు రెడ్డి, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

కళాసీ సంఘం ఆధ్వర్యంలో.. కార్మిక సంఘాలు, రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపులో భాగంగా పట్టణంలో పట్టణ కళాసీ సంఘం, రైతు కూలి సంఘాలు పట్టణ కళాసి సంఘం ఆఫీస్ వద్ద నుండి చర్చి సెంటర్, మేదర బంధ, మెయిన్ బజార్, తాండ్రపాపారాయుడు సెంటర్ మీదుగా ఎన్‌టిఆర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ, పట్టణ కళాసీ సంఘం అధ్యక్షులు బోగాధి అప్పలస్వామి, ఉపాధ్యక్షులు పిరిడి అప్పారావు, కోశాధికారి పైలా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడలో తమ విధులన బహిష్కరించి కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాలు ర్యాలీ రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకుడు



కొత్తవలస : నిరసన ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు

చల్లా జగన్, జిల్లా రైతు సంఘం నాయకుడు చలుమూరి శ్యామ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వల్లంపూడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్, వెలుగు, ఉపాధిహామి కార్యాలయాల వద్ద ర్యాలీ ప్రారంభించి ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత గ్రామీణ బ్యాంకు జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ లీడర్లు ఉమా, మంగలక్ష్మి, రమాబాయి ఆశా వర్కర్ల యూనియన్ లీడర్లు సన్యాసమ్మ, కుమారి శాంతి, అబద్ధం, ఆనంద్, ఈశ్వరమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మెంటాడ పురవీధుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సిఐటియు, ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రంమలో కౌలు రైతులు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తామరపల్లి సోములు, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి హారికృష్ణవేణి, సిఐటియు మండల అధ్యక్షులు పొట్నూరు వరలక్ష్మి, గొర్లె సన్యాసమ్మ, సిహెచ్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటి రేగ: కార్మిక, ప్రజా సంఘాలు ఐక్య వేదిక, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక జాతీయ రహదారి బ్రిడ్జి నుంచి హైస్కూల్, పోస్ట్ ఆఫీస్ మీదుగా బజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ, నైలాన్ కార్మికులు రౌతు లక్ష్మణమూర్తి, మురళి , అంగన్వాడీలు సుజాత, చిన్నమ్ములు, ఆశ రమణమ్మ, ఎఎన్ఎంలు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి రామ్ మందిరం సెంటర్ వరకు కార్మికులు, కర్షకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎపి రైతుసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎస్.గోపాలం మండల కార్యదర్శి జి.లక్ష్మి, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఆశ వర్కర్ల మండల యూనియన్ అధ్యక్షులు జి పార్వతి, గ్రీన్ అంబాసిడర్ నాయకుడు రామారావు, సిపిఎం కార్యకర్తలు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దెంకాడ: కార్మిక, ప్రజా సంఘాలు ఐక్య వేదిక, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక జాతీయ ముఖం బ్రిడ్జి నుండి సబ్ రిజిస్టర్ ఆఫీస్ మీదుగా పంచాయతీ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సూర్యనారాయణ, అంగన్వాడి యూనియన్ మండల నాయకులు ఎం కొర్లమ్మ, పి. అనిత, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారుపాప, ఆటో యూనియన్ అధ్యక్షులు ఓనం రమణ, ఎద్దు అప్పారావు, విఆర్ఎ సంఘం మండల అధ్యక్షులు బి. చంద్రరావు, గ్రీన్ అంబాసిడర్ సంఘం నాయకుడు బి. సూరిరాములు, మధ్యాహ్న భోజన కార్మికులు, హేచరీ యూనియన్ నాయకులు బి నర్సినాయుడు, డి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: ర్యాలీ చేస్తున్న కార్మికులు, నాయకులు


నెల్లిమర్ల: ర్యాలీ చేస్తున్న ఆశ, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, నాయకులు


రామభద్రపురం: నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు


వేపాడ: ర్యాలీ చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు

హామీలు అమలులో కూటమి విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్నికల హామీలు అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమిని గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రచారం చేసి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. తల్లికి వందనం అమలు చేసినప్పటికీ అర్హులందరికీ ఇవ్వలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, పేదలకు సామాజిక పింఛన్లు మంజూరులో విఫలమయ్యారని చెప్పారు. బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రజల మద్దతుగా వైసిపి విజయం సాధిస్తే టిడిపి ప్రలోభాలు పెట్టి మున్సిపాలిటీను అడ్డదారిలో కైవసం చేసుకోవడం అన్యాయమన్నారు. టిడిపికి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం సాధించడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మాట్లాడుతూ పింఛన్లు కోసం పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. రోడ్లు గోతులమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసి రోడ్లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌తో బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పారా క్రీడలు వికలాంగుల జీవితాల్లో వెలుగు నింపే సాధనమని, వాటి ద్వారా వారు బంగారు భవిష్యత్తు సాధించగలరని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె. దయానంద్ అన్నారు. మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద సాయి కొరియన్ క్యాంపస్ ఛాలెంజ్ స్కూల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర కరపత్రాలను విద్యార్థులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం దయానంద్ మాట్లాడుతూ పారా క్రీడల ద్వారా శారీరక, మానసిక అభివృద్ధి సాధ్యమవుతుందని, చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని వివరించారు. పారా క్రీడాకారుల కోసం విశాఖపట్నంలో 22 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలతో కూడిన స్టేడియం నిర్మాణం జరుగుతోందని, వికలాంగులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఛాలెంజ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ, సాయి కొరియన్ మెంబెర్ ఎం.ఎస్.నాయుడు, అసోసియేషన్ ప్రతినిధి పూసపాటి ప్రతాప్ వర్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌కు జిందాల్ భూ నిర్వాసితులు

శృంగవరపు కోట: మండలంలోని బొడ్డవరలో జిందాల్ భూ నిర్వాసితులు తమ గోడు తెలుపుకోవటానికి పోస్ట్ ద్వారా విన్నపాలను హ్యూమన్ రైట్స్‌కు బుధవారం పంపించారు. ఇందులో భాగంగా జిందాల్ నిర్వాసిత హరిజన గిరిజన రైతులు మాట్లాడుతూ గత 20 రోజులుగా తమ సమస్యల పరిష్కారానికి చెయ్యని ప్రయత్నం లేదని, ఇప్పటివరకు మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ రఘు రాజు, ఎమ్మెల్యే లలిత కుమారి, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులకు, ఎస్సి, ఎస్‌టి కమిషన్ల చైర్మన్లకు కలిసి తమ సమస్యలు తెలిపామన్నారు. కానీ ఏ విధమైన భరోసా ఎవరి దగ్గరి నుంచి రాలేదని, ఎస్సి, ఎస్‌టి, బీసీ నిర్వాసితులైన తమ దగ్గరికి వచ్చి తమ సమస్యలు విన్న మాజీ మంత్రి వడ్డే సోమనాథేశ్వరరావు, మహా దేవ్ సూచనలు మేరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ గురించి తెల్సుకొని ఈ విన్నపాలు పంపించామని చెప్పారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ అయినా తమ విషయంలో చొరవ తీసుకొని న్యాయ బద్ధంగా రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులు తమకు దక్కేలా తగు విచారణ జరిపించి న్యాయం చెయ్యాలని కోరారు.

తాగునీటి సమస్యపై స్పందించిన కర్రోతు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం పూసపాటిరేగలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి, ఎపి మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొని పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. పర్యటన సందర్భంగా గ్రామంలోని యాతపేట ప్రాంతం ప్రజలు వీధిదీపాలు, తాగునీటి సమస్యలను బంగార్రాజు దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే పంచాయతీ కార్యదర్శిని పిలిపించి సమస్య పరిష్కారం చేయాలని సూచించారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇకి ఫోన్ చేసి సమస్య ప్రదేశానికి రమ్మని కోరారు. ఆయన వచ్చిన తర్వాత ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి అధికారులతో కలిసి ప్రదేశాన్ని సందర్శించి తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు. నాలుగు రోజుల్లోగా తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలందించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆయన ఈ సందర్భంగా గుర్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి పిన్నింటి సన్యాసినాయుడు, ఎంపిటిసి పిన్నింటి నాగరాజు, నియోజకవర్గ యువత అధ్యక్షుడు పిన్నింటి కిషోర్, నాయకులు మురపాల భోగేష్, చందక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని గొర్లి సీతారాంపురం గ్రామంలో ఎమ్మెల్యే బేబీనాయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో తమ పార్టీ ఇచ్చిన హామీలను అన్నిటినీ నెరవేర్చుతుందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు కూడా త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఈ


నీటి సమస్యపై గ్రామస్తులు, అధికారులతో చర్చిస్తున్న కర్రోతు బంగార్రాజు

కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, సర్పంచ్ గొర్లి ఈశ్వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, యం.భుర్జివలస సర్పంచ్ సింగనపల్లి ఈశ్వరరావు, మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవ, క్లస్టర్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మండలంలోని అడ్డురివాని పాలెం వద్ద కస్తూరిబా పాఠశాలలో మరోసారి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ బుధవారం ఉదయం కెజిబివి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిబివిలో ఎటువంటి విద్యుత్తు సార్ట్ సర్క్యూట్ జరగలేదని, ఇది మానవ తప్పిదంగానే భావించాలని అన్నారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో, ఎవరి హస్తం ఉందో క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిల భవిష్యత్తు తమ బాధ్యత అని కలెక్టర్ చెప్పారు. ఇండ్లకు వెళ్లిన విద్యార్థినిలను సాయంత్రంలోపు తీసుకురావాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రహరీ చుట్టూ కాపలాకాయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పాఠశాలలో వరుసగా రెండు దఫాలుగా అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పాఠశాలలో సార్ట్ సర్క్యూట్ జరగలేదని విషయాన్ని గ్రహించిన అధికారులు, అసలు ఎలా జరిగిందో విచారించాలని ఆదేశించారు. మంగళవారం రాత్రి జరిగిన రెండవ దఫా అగ్నిప్రమాదంలో గాయపడిన విద్యార్థులను పూర్తిగా కోలికొనేలా వైద్యాధికారులు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదం వల్ల ఎవరు ఎటువంటి ఆందోళనకూ గురి కావద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పాఠశాల సక్రమంగా నడవడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చందనవసరం లేదని ఈ సందర్భంగా కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను సోధించి సాయంత్రానికి నివేధిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాట్ల కీర్తి, జిల్లా విద్యుత్ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, కొత్తవలస మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొత్స జన్మదిన వేడుకలు

చీపురుపల్లి: మాజీ మంత్రి, ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ జన్మదిన వేడుకలను చీపురుపల్లిలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పాల్గొని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. బొత్స సత్యనారాయణ పేరిట కనక మహాలక్ష్మి అమ్మవారి గుడిలో జిల్లా కార్యదర్శి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, బాపూజీ వృద్ధా శ్రమంలోనూ రోగులకు, వృద్ధులకు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. భారీ ర్యాలీ చేశారు. ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర ఆధ్వర్యాన పేదలకు చీరలు పంపిణీ చేశారు. విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేసి, మధ్యాహ్న భోజన ఏర్పాటు చేశారు. సత్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆ సంస్థల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు ప్రారంభించి వైద్య సేవలు అందించారు.

రేగిడి సహకార సొసైటీకి తాళాలు

సిబ్బంది లేకపోవడంతో వెనుదిరిగిన రైతులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని రేగిడి ఆమదాలవలస ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ బుధవారం తాళాలు వేసి ఉండడంతో వివిధ సేవా పనుల కోసం వచ్చిన రైతులు నిరీక్షించి వెను తిరగవలసిన పరిస్థితి నెలకొంది. ఈ సొసైటీకి 13 గ్రామ పంచాయతీలకు సంబంధించి సభ్యత్వం కలిగిన 1800 మంది రైతులు సేవలు వినియోగించు కుంటున్నారు. ఖరీఫ్ వ్యవసాయానికి రైతులకు రుణాలు, బ్యాంకుల ద్వారా రుణాలు పొందినవారు నో డ్యూ సర్టిఫికేట్ కోసం ఈ సొసైటీకి వస్తున్నారు. తాళాలు వేసి ఉండడంతో వివిధ గ్రామాల రైతులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిరీక్షించినా సిబ్బంది రాక ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రజాశక్తి సొసైటీ పరిస్థితిపై గ్రామస్తులను ఆరా తీయగా సమయాలు పాటించడం లేదని, సిబ్బంది ఎప్పుడు వస్తారో రారో తెలియని పరిస్థితి ఉందని అన్నారు. నిత్యం ఇదే తంతు జరుగుతుందని సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి సొసైటీని సమయాలకు తెరిచి రైతులకు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతలు, ప్రజలు తదితరులు కోరుతున్నారు.

పిఎసిఎస్‌లకు త్రిసభ్య కమిటీ నియామకం

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామభద్రపురం సొసైటీ చైర్ పర్సన్‌గా చొక్కాపు విజయలక్ష్మీ, సొసైటీ డైరెక్టర్లుగా మహంతి ధనంజయ, సువ్వాడ బలరాంలను డైరెక్టర్లుగా నియమించారు. ఈ మేరకు బుధవారం ఈ ముగ్గురికి బ్యాంకు సిఇఒ చింతల వాసుదేవరావు ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో ఆర్డర్ కాపీలు ఇచ్చి సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వసంతుల తిరుపతిరావు, భవిరెడ్డి చంద్ర, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కావు రామారావు, బొబ్బిలి నియోజక వర్గం తెలుగు యువత అధ్యక్షుడు మజ్జి రాము, నియోజక వర్గ మాజీ సైనికుల సలహాదారు టి.సత్యారావు, టిడిపి సీనియర్ నాయకులు వసంతుల వెంకటరావు, తెంటు ఉమా పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ముగ్గురు వ్యక్తులతో నాన్ ఆఫీసియల్ పర్సన్ ఇంచార్జ్ కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గజపతినగరం సొసైటీ చైర్ పర్సన్‌గా లెంక బంగారు నాయుడును, కమిటీ సభ్యులుగా కడమల అప్పయమ్మ, గొర్లి బంగారు నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.

మెంటాడ: మెంటాడ పిఎసిఎస్ త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా గొర్లె ముసలి నాయుడును కూటమి ప్రభుత్వం నియమించింది. డైరెక్టర్లుగా రెడ్డి ఆదినారాయణ, మణిపూరి రామచంద్రుడు, జక్కువ సొసైటీ చైర్మన్‌గా ఆరనీపల్లి సత్యం, డైరెక్టర్లుగా కుంచి వెంకటరమణ, బాయి వెంకటరావులను నియమించింది. ఈ సందర్భంగా చైర్మన్ ముసలినాయుడు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి, రైతులకు అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తానని చెప్పారు.

మూడు లక్షల సిల్వర్ ఆభరణాలను సీజ్

ప్రజాశక్తి- విజయనగరం కోట

రూ. 3లక్షల విలువైన సిల్వర్ ఆభరణాలను పట్టుకొని సీజ్ చేసినట్లు జిఆర్‌పి ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. బుధవారం విశాఖపట్నం జిఆర్‌పి లైన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ ఆధ్వర్యాన విజయనగరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంలో ముమ్మర తనిఖీలు చేస్తుండగా శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన ప్రవీణ్ సింగ్ సోంపేట నుండి విశాఖపట్నంకు సిల్వర్ ఆభరణాలను బ్యాగ్‌లో తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటికి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.